## గురజాడ వీధి

# మనసొప్పని ఆచారం



కాంవులు బైట మంచి 'పంతులు గారు, దండాలు' అవి కేకేసింది. శాస్త్రిగారు చదువుతున్న దివపత్రికవి కాస్త కిందకు దించి, తలవంచి కళ్ళ జోడు ఫ్రేము పైనుంచి కాంవుల్ని చూసి 'నువ్వు ఇందాకే కదటే వీళ్ళు తీసుకెళ్ళావు?' అన్నారు.

'ఔను పంతులు గారు. కాని నాను ఈ తూలి ఒచ్చినాది డబ్బుకోసం వండి.'

'ఎంత కావాలి?'

'రెండు వందలు ఇప్పించండి.'

'సరే, ఇస్తా. ఈనెల సింహాద్రి జీతంలోంచి నాకు నువ్వు ఇచ్చింది ఎనిమిది వందలు. దాంట్లో నాలుగు వందలు ఇదివరకే పట్టుకెళ్ళావు. ఇప్పుడు ఇస్తున్న 200 రూపాయలతో నీకు ఆరు వందల రూపాయలు అందినట్టు. ఇంకా నా వద్ద మిగిలింది ఇది వరకటివి 400 రూపాయిలు, ఈ నెలవి 200 రూపాయలు. మొత్తం ఆరు వందల రూపాయలు.'

'అదేటి, పంతులు గారు. నాను లెక్క అడిగి నానా ఏటి? నాకు రావలసిన డబ్బు అయిపోగానే సెప్పేయండి శావ. బిడ్డకి అమ్మపైన ఎంత నమ్మకం ఉంటదో నాకు మీ మీద అంత నమ్మకం ఉంది పంతులు గారు.'

నీ ఇల్లు బంగారం గాను. నువ్వు లెక్కలడగకపోయినా, చెప్పడం నా విధి కదటే. అందుకే లెక్కలు చెప్తాను. ఉండు, డబ్బు తీసుకొస్తాను' అని శాస్త్రిగారు లోపలకి వెళ్ళారు.

కాంవులు డబ్బు శాస్త్రి గారి వద్దకి ఎలా వచ్చింది. అదో కథ:

ఓ రోజు శాస్త్రిగారు వీధిగుమ్మం బైట కూర్చుని ఉన్నారు. ఇంతలో మాలవాడలోంచి పెద్ద గోల వినబడింది. ఏవో శోకన్నాలు, ఏడుపులు, శాపనార్థాలు.

'ఏంవిటా గోల?' అని అప్పుడే ఎద్దుల్ని తోలుకు వెళుతున్న లింగడిని అడిగారు శాస్త్రిగారు.

'అయాయండి? సింహాద్రి పెళ్ళాన్ని తన్నినాడండి. దాంతో అది ఏడుత్తోందండి.'

'ఔనులే, లింగా. వాడు కాంవుల్ని తన్నడం, అది ఏడవడం కొత్త కాదుగా.'

'పాపం రెండు రోజులై కొంపలో గింజలు నేవండి... దాంతో అది సింవాద్రిని డబ్బులు అడిగినాదండి. అడు డబ్బులు ఇవ్వకపోగా తన్నినాడండి. దాంట్లోను, తాగున్నాడేమో, గట్టిగానే బాదేసి నాడండి. దెబ్బలు తగిలినాయి.'

'పాపం, మీరు వాడికి నచ్చజెప్పకపోయారా?'

'బాగుందండి పంతులుగారు. ఆడికి నచ్చజెప్పి మమ్మలిని కూడా తన్నులు తినమంటారా ఏటి? కిందటిసారి అప్పన్న తాత ఆడికి వచ్చజెప్పబోతే మున లోడనే మరియాద నేకుండా కిందపడేసి కాళ్ళతో కుమ్మేసి నాడండి.'

'అయ్యో, పాపం' అని శాస్త్రిగారు ఊరుకున్నారు. ఆ రోజే కాంవులు శాస్త్రిగారి దగ్గరికి వచ్చి ఏడువులంకించుకుంది. 'ఏదైనా సేయండి, పంతులు గారు. ఆ సచ్చినోడు ఇంటికర్సుకి డబ్బులు ఇవ్వ డండి. జీతం అంతా తాగుడికీ, జూదానికీ తగలేత్తాడు, పంతులు గారు. పిల్లలు, నాను కదువు మాడి సత్తున్నావండి' అంది.

'చూడు, కాంవులు. ఇది నీ కావురానికి సంబం ధించిన సమస్య. నువ్వు నిబ్బరంగా మెసలి, నీ పెనిమిటిని దారిలోకి తెచ్చుకోవాలి' అన్నారు శాస్త్రిగారు.

'అలా అనకండి పంతులు గారు. ఆడిని దారి లోకి తేవడం మాటలతో అయే పని కాదండి. తంవరే ఏదో ఉపాయం సేయాల.'

'సరే, నా ప్రయత్నం నేను చేస్తాను. నువ్వు వెళ్ళు.'

కాంవులు వెళ్ళిపోయాక శాస్త్రిగారు ఆలోచనలో పడ్డారు.


'ఏంవిటి ఆలోచిస్తున్నారు?' అంటు శాస్త్రిగారి భార్య కాంతమ్మ గారు వచ్చింది, చేతిలో కాఫీ గ్లాసుతో.

'ఏంలేదు, కాంతం. కాంవులు సమస్య గురించి ఆలోచిస్తున్నా' అన్నారు శాస్త్రి గారు కాఫీ గ్లాసు అందుకుంటూ.

'దాని సమస్య తీర్చడం మానవతరం కాదు.'

'నాయుడు బావ ఏంవైనా ఉపాయం చేయగలడో మాట్లాడి చూస్తా.'

'సింహాద్రి నాయుడి గారి ట్రిక్కులు నడవు తాడు. అది నిజమే కాని ఆయన మాత్రం ఏం చేయగలడు? ఆయన తాగొద్దని కాని, పెళ్ళం



పులిగడ్డ విశ్వనాథరావు

మీద చేయి చేసుకోవద్దని చెప్తే మాత్రం సింహాద్రి వింటాడా, చస్తాడా?'

'నాదో ప్లాను ఉందిలే. నీకు తరువాత తెలుస్తుంది. ఏదీ నా కండువా ఇవ్వు' అని చెప్పి ఖాళీ కాఫీ గ్లాసు అందించి, కండువా, చెప్పులు వేసుకుని బైలుదేరారు.

'ఊరు చివర నాయుడు గారి ఇంటికి చేరుకున్నారు శాస్త్రిగారు. నాయుడు గారు ఇంటి బైట చెట్టు కింద కుర్చీలో కూచుని జీతగాళ్ళతో మంతనాలు చేస్తున్నారు.

'రా, రా, బావా' అంటూ శాస్త్రిగారిని పలకరించి, 'మీరంతా యెల్లండ్రా' అని జీతగాళ్ళని పంపించేశారు నాయుడు గారు. శాస్త్రిగారు ఎదుటి కుర్చీలో కూర్చున్నాక 'చూసినావా, మాంవకి మించిన అల్లుణ్ణి' అన్నారు నాయుడు గారు నాటి రాజకీయ పరిస్థితిపై వ్యాఖ్యానిస్తూ.

'నిజంవే. అల్లుడు మాంవకంటే రెండాకులు ఎక్కువే చదివాడు కాని...' అంటు ఇద్దరు కొద్దిసేపు రాష్ట్ర రాజకీయాలు ముచ్చటించుకున్నారు.

నాయుడు గారు, శాస్త్రిగారు చిన్ననాటి స్నేహితులు. నాయుడు గారి మేనత్త కొడుకు కూడా వాళ్ళతోనే ఉండేవాడు. ముగ్గురు ఎల్లప్పుడూ కలిసే ఉండేవారు. నాయుడి గారి మేనత్త కొడుకు, నాయుడు గారు ఒకరినొకరు 'బావా', 'బావా' అని పిలుచుకోవడంతో శాస్త్రిగారు కూడా వాళ్ళని 'బావా' అని పిలిచేవాడు. వాళ్ళు కూడా శాస్త్రి గారిని అదే వరసతో పిలిచేవారు.

రాజకీయాలు ముచ్చటించుకున్నాక, 'ఏటి, ఇలా ఒచ్చినావు, బావా?' అని నాయుడు గారు అడిగారు.

'ఏం లేదు బావా. సింహాద్రి మీ ట్రక్కులు నడుపుతాడు కదా. వాడి గురించి మాట్లాడుదామని వచ్చా.'

'ఔను, సింవాదిరి డ్రైవరుగా బానే పని సేత్తాడు కాని ఒచ్చిన సిక్కల్లా ఏటంటే ఆడు ఉత్త తాగుబోతు, జూదరి. సెప్ప, ఏం సేయాల?'

'వాడి పెళ్ళాం నా వద్దకి వచ్చింది. ఇంటి ఖర్చుకి డబ్బులివ్వడట. ఇల్లు గడవడం కష్టంగా ఉందని మొరపెట్టుకుంది.'

'అంతేలే. ఓ తూరి ఆడి పెళ్ళాం నా కాడికి కూడా ఒచ్చి సెప్పకుంది. అలాగే ఆడికి నచ్చజెప్తా, ఎల్లి రామ్మా, అని పంపేసినా. ఆలాగే ఆడికి నచ్చజెప్పినా కాని తాగుబోతుకి నీతి సెప్పటం, ఎనుబోతుకి సంగీతం ఇనిపించటం ఒకటే కదా. ఆడు తాగుడు తగ్గించనూ నేదు, ఆడి పెళ్ళాం నలుగురి ఎదుటా లబోదిబోమనడం మాననూ నేదు.'

'సరే, ఓ పని చేయి, బావా. సగం జీతం నీ పెళ్ళానికే ఇస్తానని చెప్ప. సంతకం వాడి చేత పెట్టించి, సగం జీతం మాత్రం వాడికిచ్చి, మిగతాది వాడి పెళ్ళానికి ఇవ్వు.'

'అది కూడా లాభం ఉండదు. ఎందుకంటే ఆడు ఇంటికెళ్లి దాన్ని తన్ని డబ్బు లాక్కుంటాడు.'

'మరి ఈ వ్యవహారంలో నేను కూడా ఉంటాను కదా. అది డబ్బు నాకిస్తుంది. ఆ తరువాత అవసరం మేరకు నా దగ్గర డబ్బు తీసుకుంటూ ఉంటుంది. అదీ కథ.'

'ఇంతకీ ఆడు దానికి ఒప్పుకుంటాడంటావా?'

'ఒప్పుకోకపోతే నీ చేతిలో తిరుగులేని బెత్తం ఉండనే ఉంది కదా? దాంతో ఓటి చేస్తే చాలు.'

'అంటే బర్తరఫ్ బెత్తం. అవున్లే, ఉన్న ఊళ్ళో ఉజ్జోగం అంటే మాటలా. సరే, అది నే సూసుకుంటా.'

నాయుడు గారు అన్నమాట నిలువుకున్నారు. సింహాద్రి సంతకం పెట్టి సగం జీతమే తీసుకుంటున్నాడు. మిగతా సగం కాంవులు అందుకుని శాస్త్రి గారికి ఇస్తోంది. అవసరం ఉన్నప్పడల్లా వచ్చి విడతలలో తీసుకుంటోంది.

శాస్త్రిగారు రెండు వందల రూపాయల నోట్లు తీసుకొచ్చి గుమ్మం బైట అరుగు మీద ఉంచారు.

'ఏంవిటి కాంవులు, నువ్వు డబ్బు అందుకుని నా కివ్వడం నీ పెనిమిటికి నచ్చి ఉండే' అన్నారు శాస్త్రిగారు.

'యెలా నచ్చుతది పంతులు గారు... నన్ను సితక తంతాడు కాని నా కది అలవాటే కదా నాను పట్టించుకోటం నేదు.'

ఇంతలో పైడితల్లి వచ్చి 'దండాలు పంతులు గారు' అని పలకరించాడు

'ఇదేంవిటిరా, పైడితల్లి. ఇదేనా నువ్వు వచ్చే వేళ?' అని శాస్త్రి గారు కసురుకున్నారు.

కాంవులు 'యెల్లొస్తా, పంతులు గారు' అని చెప్పి నోట్లు రొంటిలో దోపుకుని వెళ్ళిపోయింది.

పైడితల్లి 'ఏటి సేసేది, పంతులు గారు. రాత్తిరల్లా కంటిలో కునుకు నేదు. జొరంతో ఒళ్ళు కాలిపోనాది.'

'ఏమైందిరా నీకు? కిందటి వారమే నిన్ను డాక్టరు దగ్గరికి వెళ్ళమని చెప్తినే. నువ్వు వెళ్ళావా?

'ఎల్లనేదు, పంతులు గారు.... నీల్లు పోయండి కుండలో. బేగిపోతా.'

'ఒరి నీ అసాధ్యంకూలా. రెండు వారాలైంది, జ్వరం తగ్గడం లేదు. అయినా కూడా మందు తీసుకోలేదట్రా?'

'మాకు జొరాలొత్తే, అయే తగ్గిపోవాలండి. యాంవు డాక్టర్ల కాడికి యెల్లం. బేగి నీల్లు పోయండి పంతులు గారు.'

'ఆ కుండ నింపుతా కాని ముందు నువ్వు ఆస్పత్రికి వెళ్ళిరారా.'

'అలాగే తర్వాత యెల్తానండి.. ముందు...'

'ముందు లేదు వెనకాలేదు. ముందు ఆస్పత్రికి వెళ్తావా లేక కర్రుచ్చుకోమంటావా?'

'యెల్తా, పంతులు గారు, యెల్తా. కాని నీల్లు...

'నీ మొహం మండ. మందు నువ్వు ఆస్పత్రికి వెళ్ళి తగలడితే కాని నీకు ఒక చుక్కనీరు పోయను.'

'అలాగే పంతులు గారు. ఇదిగో యెల్లి ఒత్తా' అని లోలోనే 'ఈ పంతులు మనసు మంచిదే. మా మాలవాడలో బావి ఎండిపోనాది అని తెలిసి మా ఇంటి బావిలోంచి మీరంతా నీల్లు ఒట్టుకెల్లండ్రా' అని పాపం ఒచ్చినాల్లందరికీ సాయంగా నీల్లు తోడి పోత్తున్నాడు, కాని ఉత్త తిక్కమడిసి. పేనాల మీదకి ఒత్తే కాని మాంవు ఆసపత్తిరి మొగం సూడం కదా. అలాటిది ఉత్త జొరానికే ఆసపత్తిరికి పోయి మందు ఒట్టుకొచ్చుకో అని సంపుతున్నాడు. మరి యెల్లక తప్పతదా?'

'ఒరే పైడితల్లి! కిందటి ఆదివారమే నీ గురించి డాక్టరు గారికి చెప్పా. ఆయన నీ రక్తం పరీక్ష చేస్తాడు. అన్నీ సవ్యంగా చేయించుకుని ఆయన ఇప్పటికి ఇచ్చే మందు తెచ్చుకో. రక్త పరీక్ష రిపోర్టు వచ్చాక ఇంకా మందులు ఇస్తాడు'.

'అలాగే పంతులు గారు.'

'ఆ మందు తీసుకొచ్చి నాకు చూపి మరీ నీళ్ళు తీసుకెళ్ళరా. లేకపోతే నువ్వు ఆస్పత్రికి వెళ్ళి చావవని నాకు తెలుసులే.'

'అలాగే మందు ఒట్టుకొచ్చి మీకు సూపెడతాగా' అని సెప్పి 'నేకపోతే నువ్వు ఇడిసి పెడతావా ఏటి?' అని గొణుక్కుంటూ అడుగువేస్తున్న వాడల్లా ఆగిపోయి, 'అం, దండాలు, సిన్న పంతులు గారు' అని అప్పడే ఇంటి బైటకు వచ్చిన శాస్త్రిగారి అబ్బాయి రామకృష్ణని పలకరించాడు పైడితల్లి.

రామకృష్ణ 'బాగున్నావా, పైడితల్లి?' అని బదులు చెప్పగా 'ఒంట్లో బాగునేదు, సిన్న పంతులు గారు.

ఆసపత్రిరికి పోతన్నా, నేకపోతే మీ అయ్యగారు నా తోలు ఒలిసేత్తారు.'

'ఇంకా కదల వేంటిరా, రాస్కెల్. ఏదీ క్కర?' అనగానే పైడితల్లి పరుగుతీశాడు.

'ఏంవిటి, నాన్నా? పైడితల్లిని చిన్నపిల్లాడిలా కసురుతావు.'

'లేకపోతే ఈ దౌర్భాగ్యుడు రెండు మూడు వారాలయి ఉష్ణంతో ఉన్నా మందు తీసుకోడే. మలేరియా జ్వరమో, ఏ పాడు జ్వరమో. కిందటి వారం వీడి గురించి డాక్టర్‌కి స్పెషల్‌గా చెపితే, పంపించండి, బ్లడ్ టెస్ట్ అవీ చేస్తానన్నాడు. వీడిని వెళ్ళమన్నా వెళ్ళలేదు.'

'కాని మీరు అంతలా చీవాట్లు పెట్టాలా అని?'

'వీడు నాకు చిన్నప్పటి నుంచి తెలుసులే. వీడు చీవాట్లకీ, కర్ర దెబ్బలకీ గాని లొంగడు.'

'అది సరే కాని, నాన్నా, ఓ మాట చెప్ప, నీకు వీళ్ళంటే ఎక్కడలేని సానుభూతి, ప్రేమ ఉంది. నీకు తోచిన సాయం కూడా చేస్తుంటావు. కాని వాళ్ళ పట్ల అంటరానితనం పాటిస్తూ ఉంటావు. అది నీ మానవత్వపు సిద్ధాంతానికి వ్యతిరేకం కాదా?'

'ఓరి, భడవా. నువ్వు మంచి సందేహమే వెలిబుచ్చావురా. కాని అది మన పురాతన ఆచారం. దాన్ని మార్చడం వీలు కాదు.'

'ఎందుకు కాదు, నాన్నా?'

'ఆ ఆచారం నేను మారిస్తే మారేది కాదురా.

'మరి నీ పెళ్ళప్పుడు కట్నం పుచ్చుకోవద్దని పట్టుపట్టి, మీ అమ్మానాన్నలని కట్నం లేకుండా నీ పెళ్ళి చేసేందుకు ఒప్పించావట.'

'ఔను. కాని...'

'వరకట్న దురాచారం నువ్వు మారిస్తే మారిపోతుందనేనా నువ్వు కట్నం తీసుకోలేదు?'

'అది నా సొంత విషయం కాబట్టి ఏ బాధా లేకపోయింది. అంటరానితనం మాత్రం మన కుటుంబంలో అందరికీ ప్రమేయం గల విషయం. నేను మానేసినా మీ అమ్మ ఒప్పకోవాలిగా?'

'అమ్మ విషయం తర్వాత చూద్దాం. ముందు నీ విషయం చెప్ప.'

'ఒరే, నిజం చెప్పాలంటే చాలాసార్లు నాకు ఈ ఆచారం మానవతా వాదానికి విరుద్ధమే అనిపిస్తూంటుంది రా. కాని ఎందుకో కాని దాన్ని భంగపరిచే మనోబలం నాకు కలగదు. అందరూ పాటిస్తున్నారు, మనంవ్వూ పాటిస్తే ఏం పోయిందనే భావంతో దీన్ని కొనసాగిస్తున్నా.'

'దీన్నే మెంటల్ కండీషనింగ్ అంటారు. తర్కాన్ని, యధార్థాన్ని ఉపేక్షించి, నీ మనసు తనలో తరతరాలుగా నాటుకున్న ఈ దురాచారాన్ని కొనసాగించాలని తాపత్రయపడుతోంది. ఆ భావాన్ని నువ్వు ఒక్కసారి అధిగమిస్తే చాలు. ఈ దురాచారాన్ని ప్రతిఘటించినందుకు నువ్వే ఎంతో సంతోషిస్తావు.'

'ఔనురా. దీన్ని నేను కేవలం తరతరాలు బట్టి వస్తున్న ఒక ఆచారంగా మన్నిస్తూ వచ్చా కాని మిలిటరీలో పనిచేస్తూ, అన్ని కులాల వారితో కలిసి తింటూ, పడుకుంటూ, ప్రపంచమంతా తిరుగుతూ జీవితం గడిపిన నాకు ఈ ఆచారం సరైనదని ఎన్నడూ అనిపించలేదు. నా అంతరాత్మ ఈ ఆచారాన్ని నిందిస్తూనే ఉంది.'

'నలుగురు ఏంవటారో అన్న భయమా?'

'నేను ఎన్నడు నలుగురు ఏవంటారో అని భయపడలేదురా. ఇంకా మీ అమ్మ అభిప్రాయం తెలుసుకోవాలి' అని చెప్పి 'కాంతం... కాంతం... ఓసారి ఇలా రా అని పిలిచారు.

'ఏంవండి?' అంటూ వచ్చారు కాంతమ్మ గారు.

'వీడు ఏంవాంటున్నాడో విన్నావా? మనం అంటరానితనాన్ని పాటించడం మానాలిట. నేను దానికి సిద్ధమే. మరి నీ ఉద్దేశం ఏంవిటి?'



తంతా.

టాబు పరమ సెన్సిటివ్ నటెకాదు మనిషికూడా. ఎక్కడ అన్యాయం జరిగినా స్పందిస్తుంది. ఈ మధ్య ఒక కుర్ర హీరో తల్లి నేననసలు మా ఇంటికి ఒక హీరోయిన్ కోడలు గా రావడాన్ని అస్సలు అంగీకరించను అని చెప్పింది. దాంతో ఒళ్ళు మండిన టాబు ఆవిడెవర్తో కానీ నాకు చెంపచెళ్ళుమనిపించాల నిపించింది లేకపోతే హీరోయిన్లు ఏంచేశారట. ఏం వాళ్లబ్బాయి సినిమాల్లో ఎగిరి గంతులేసినపడు లెని తప్పు అవమ్మాయిలు చేస్తే వచ్చిందా అని ఛీత్కారించింది.

'అంటే అంటరాని వాళ్ళు కూడా మన ఇంటిలోకి వచ్చి మనతో బాటే కూచుంటారా ఏంవిటి?'

'కూచోవడమే కాదు. మనతో సహా కాఫీలు తాగుతారు, అన్నం తింటారు. బావిలోంచి నీళ్ళు తోడుకుంటారు.'

'ఈ ఇంటిలో అదొక్కటే తక్కువ వచ్చింది. నాకు మీద వాటా, వెనక పెరటిలో చిన్న బావి ఇచ్చేసి, మీరు, మీ కొడుకు మాలమాదిగల కాళ్ళు కడిగి తాగండి, వాళ్ళతో తైతక్కలాడండి. నాకే అభ్యంతరం లేదు.'

'మరి నాకు, వాడికి భోజనం హోటల్ క్యారియరా?'

'వండి క్రిందకి పంపించేస్తా. మీ కంచాలు, గ్లాసులు, చెంబులు వేరుగా ఉంటాయి.'

'అదేంవిటమ్మా. 'మాలలు, మాదిగలు మనలాంటి మనుషులు కాదా?' అని రామకృష్ణ అడిగాడు.

'ఒరే. నీ పెత్తనాలు ఊళ్ళోనే వెలగబెట్టు నన్ను మాత్రం విడిచిపెట్టు' అంది కాంతమ్మ గారు కోపంగా.

'ఇంట గెలిచి రచ్చ గెలవమన్నారు. యూత్ క్లబ్ సెక్రెటరీగా నేను ముందుగా అస్పృశ్యతా నిర్మూలన ఉద్యమాన్ని మన ఇంటిలోంచే ప్రారంభించదలిచా, అమ్మా' అన్నాడు రామకృష్ణ.

'ఒరే, అప్రాచ్యుడా, నేను ఉరిపోసుకు చస్తా గాని మాల కూడు తినను' అంది కాంతమ్మ గారు నిక్కచ్చిగా.

'సరే కాంతం. నువ్వు మీద అంతస్తులోనే ఉండు. మేం కిందనుంటాంవు. భోజనం వండి పంపు. కాని అప్పడప్పడు మనం మాట్లాడుకోవచ్చుగా' అన్నారు శాస్త్రిగారు కాస్త నవ్వుతూ.

'మీ మాల ఫ్రెండ్స్ నుంచి మీకు తీరిక ఉన్నప్పడు మాట్లాడుదురు గాని' అని రుసరుసలాడుతూ వెళ్ళిపోయింది కాంతమ్మ గారు.

'కంగ్రాట్యులేషన్స్, నాన్నా. ఒక ఆదర్శం కోసం నువ్వింత త్యాగం చేస్తున్నావంటే నువ్వు చాలా గొప్పవాడివి' అన్నాడు రామకృష్ణ.

'చూద్దాంరా, మీ అమ్మ కూడా ఎంతకాలం చెట్టుమీద కూచుంటుందో..'

'పంతులు గారు, ఇదిగో మందులు ఒట్టుకొచ్చానండి. సూడండి' అని పైడితల్లి బైటనుంచి అరిచాడు.

'అప్పడే తగలడ్డావురా. నెత్తురు పరీక్ష అయిందా?'

'అం, సూదితో పొడిసి నెత్తురు బొట్లు తీసుకున్నారండి. రేపు మళ్ళీ రమ్మన్నారండి.'

'సరే, నీకు నీళ్ళు కావాలి కదూ? నువ్వే బావిలోంచి తోడుకోరా' అన్నారు శాస్త్రిగారు.

అదేటి, పంతులు గారు. నన్ను తోడుకోమంటున్నారు? పరాసికం ఆడుతున్నారా ఏటి?'

'నీతో నాకు పరాచికం ఏంవిటిరా? నేను నీ బాబుగాడి గులామునిరా, రోజు నీళ్ళు తోడి నీకు పోయడానికి?'

'మరేం కాదండి. మీ బావి మైలపడి పోతదండి.'

'మళ్ళీ వాగుడు మొదలెట్టావురా?'

'సిన్న పంతులు గారు, తమరే నీళ్ళు తోడి పోయండి.'

'ఫర్వాలేదు, పైడితల్లి. నువ్వే నీళ్ళు తోడుకో. నాన్న బాగా ఆలోచించే నిన్ను నీళ్ళు తోడుకోమంటున్నాడు' అన్నాడు రామకృష్ణ.

'అలాగే, సిన్నపంతులు గారు. కాని ఊళ్ళో అంతా...'

'నీ పిండాకూడు. నువ్వు నీళ్ళు తోడుకుంటావా లేక...' అంటూ కళ్ళురిమారు శాస్త్రిగారు.

'కర్రుచ్చుకోకండి పంతులుగారు. ఇదిగో నీల్లు తోడుతున్నా' అన్నాడు పైడితల్లి బావివైపు నడుస్తూ. చేద అందుకుని నూతిలో వేస్తూండగా తండ్రీ కొడుకుల పకపకలు వినవచ్చాయి.

వాడికి కూడా నవ్వాగలేదు. ♦